

కేంద్ర ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ నిరసన

కాళ్ల: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని కాంగ్రెస్ పార్టీ ఉండి నియోజకవర్గ అధ్యక్షులు వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు అన్నారు. నిత్యావసరాల ధరల పెంపుపై మంగళవారం జువ్వలపాలెం పెట్రోల్ బంక్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణంరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొర్రా పార్థు, మండల అధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సోము నాగశేషుబాబు, నాయకులు పాల్గొన్నారు.

తణుకు: ఎల్ఐసి, ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎల్ఐసి కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మారెడు బాబ్జి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కడలి రామారావు, పిసిసి అధికార ప్రతినిధి రామకృష్ణ, నేతలు రుద్రవరం, చుక్కాకుల వరలక్ష్మి, బోస్, కె.వెంకట్రావు పాల్గొన్నారు.

గీత దాటితే ఖబడ్దార్..!


ఎంఎల్‌సి ఎన్నికలపై తమ స్థానిక ప్రజాప్రతినిధులకు వైసిపి అధిష్టానం హెచ్చరికలు

ఓటు తప్పకుండా వేసేలా అధికార పార్టీ వ్యూహాలు

మంత్రి కారుమూరి, మిథున్‌రెడ్డికి జిల్లా బాధ్యతలు

వైసిపికి ముచ్చెమటలు పట్టిస్తున్న ప్రతిపక్షాలు

రసవత్తరంగా ఎంఎల్‌సి సమరం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

స్థానిక సంస్థల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల సమరం రసవత్తరంగా మారుతోంది. స్వతంత్ర అభ్యర్థులు అధికారపార్టీకి ముచ్చెమటలు పట్టిస్తున్నారు. స్వతంత్ర అభ్యర్థులకు ప్రతిపక్ష టిడిపి, జనసేన మద్దతు లభించడంతో ఎన్నికల పోరు హాట్‌టాపిక్‌గా మారింది. జిల్లాలో స్థానిక సంస్థలకు చెందిన రెండు ఎంఎల్‌సి స్థానాలకు ఈ నెల 13న ఎన్నికలు జరగనున్నాయి. జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు మొత్తం 1,105 మంది తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. దాదాపు 870 మంది వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులే ఓటర్లుగా ఉన్నారు. దీంతో రెండు ఎంఎల్‌సి స్థానాలు వైసిపికి ఏకగ్రీవంగా దక్కాల్సి ఉండగా స్వతంత్ర అభ్యర్థులు నలుగురు బరిలో నిలవడంతో ఎన్నికలు తప్పలేదు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన వీరవాసరానికి చెందిన వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి మద్దతివ్వడంతోపాటు సర్పంచుల ఛాంబర్ సైతం మద్దతు పలికింది. ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులకు ఓటు వేయొద్దని జనసేన అధినాయకత్వం సైతం పిలుపునిచ్చింది. దీంతో టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు ఓటు వేయనున్నట్లు స్పష్టమైంది. టిడిపి, జనసేనకు 217 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు. మరో 250 మంది ప్రజాప్రతినిధులు ప్రతిపక్షాలు బలపరిచిన అభ్యర్థికి మొదటి ప్రాధాన్యత ఓటు వేస్తే ఫలితం తారుమారయ్యే పరిస్థితుంది. ప్రభుత్వంపై స్థానిక ప్రజాప్రతినిధుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. దీంతో ఓట్లు చీలే అవకాశం ఉందని వైసిపి నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. ఓట్లు చీలకుండా వైసిపి ప్రజాప్రతినిధులంతా పక్కాగా వైసిపి అభ్యర్థులకే ఓటు వేసేలా వైసిపి నాయకత్వం ప్రణాళికతో ముందుకు సాగుతోంది. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రీజనల్ కోఆర్డినేటర్ మిథున్‌రెడ్డికి ఎంఎల్‌సి ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించే బాధ్యత వైసిపి అధిష్టానం అప్పగించింది. వైసిపి తరపున కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పోటీలో ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా వీరవల్లి చంద్రశేఖర్‌తోపాటు గోరింక దాసు, పసల వెంకటాచలం, దేవరపల్లి ఆదాం ఉన్నారు. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్ ప్రధాన పోటీదారుగా ఉన్నారు. దీంతో వైసిపి నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులకు సమావేశాలు నిర్వహించి ఎంఎల్‌సి ఎన్నికల గురించి వివరిస్తున్నారు. ఓటు ఎలా వేయాలి, ఏ విధంగా వేస్తే గెలుపుంటుందో చెబుతున్నారు. డబ్బు పంపిణీ చేయనున్నట్లు మొదట్లో పెద్దఎత్తున ప్రచారం సాగింది. అదే జరిగితే గెలుపోటములు తారుమారయ్యే పరిస్థితి ఏర్పడనుందని వైసిపి నాయకులు అంచనా వేస్తున్నారు. తమ స్థానిక ప్రజాప్రతినిధులతో వైసిపి అగ్రనాయకులు ఒకే అంశాన్ని వివరిస్తున్నారు. ప్రతిఒక్కరూ వైసిపి అభ్యర్థులకే ఓటు వేయాలని లేకపోతే... అంటూ హెచ్చరించినట్లు తెలుస్తోంది.


ఓట్లు చీలిస్తే గెలిచినట్లుగా ప్రతిపక్షాలు ప్రణాళికలు

ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచేంత బలం లేకపోయినా ప్రతిపక్ష పార్టీలు గట్టి ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. తాము బలపరిచిన అభ్యర్థి గెలిచినా, గెలవకపోయినా వైసిపి ఓట్లు చీలిస్తే విజయం సాధించినట్లేనన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొదటి ఓటు వైసిపి అభ్యర్థికి వేసి, రెండో ఓటు ప్రతిపక్షాలు బలపరిచిన అభ్యర్థికి వేసినా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నట్లుగా స్పష్టమవుతుందని ప్రచారం చేస్తున్నారు. ఇది అధికార పార్టీకి ఇబ్బందికర పరిణామంగా చెబుతున్నారు. ప్రస్తుతం మౌనంగా ఉన్నా ఓటు వేసేటప్పుడు కచ్చితంగా కొంతమంది అధికారపార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు తాము బలపరిచిన అభ్యర్థికి ఓటువేసే అవకాశం ఉందని ప్రతిపక్షాలు అంచనా వేస్తున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఏం తీర్పు చెబుతారో ఈ నెల 16న ఓట్ల లెక్కింపు వరకూ వేచిచూడాల్సిందే.

స్వల్పకాలిక వ్యవసాయ రుణాలు ఎక్కువ ఇవ్వాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

జిల్లాలో స్వల్పకాలిక వ్యవసాయ రుణాల కింద ఇప్పటి వరకు రూ.4,501 కోట్లు మంజూరు చేశారని, వీటిని అధిక సంఖ్యలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. ఈ ఏడాది రూ.6,250 కోట్లు స్వల్ప కాలిక రుణాల కింద వ్యవసాయానికి మంజూరు చేయాల్సి ఉండగా 72 శాతం మాత్రమే లక్ష్యం చేరుకోగలిగారన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో జిల్లా కన్సల్టెంటివ్ (డిసిసి), జిల్లాస్థాయి రివ్యూ కమిటీ (డిఎల్‌ఆర్‌సి) సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాల కింద రూ.1671 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా రూ.36.71 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. వ్యవసాయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.423 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా రూ.1157 కోట్లు మంజూరు చేశారని కలెక్టర్ తెలిపారు. విద్యా రుణాల కింద రూ.75 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా కేవలం రూ.26.90 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. గృహ నిర్మాణాలకు సంబంధించి రూ.456.34 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా రూ.219.66 కోట్లు, ఇతర రుణాల కింద రూ.263.57 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా రూ.101.76 కోట్లు మాత్రమే మంజూరు చేశారని అన్నారు.

కౌలు రైతులకు ఎక్కువ మొత్తంలో రుణాలందించాలి

జిల్లాలో కౌలు రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో కౌలు రైతులకు ఎక్కువ మొత్తం రుణాలందించాలని కలెక్టర్ ప్రశాంతి సూచించారు. సిసిఆర్‌సి కార్డుదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. భూమి అభివృద్ధి, ఇతర కార్యక్రమాలకు భూయజమానికి రుణాలు మంజూరు చేయాలన్నారు. రైతులను జెఎల్ గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి అధిక మొత్తంలో రుణాలివ్వాలని సూచించారు. జిల్లాలో టిడ్కో గృహాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ 13,636 గృహాలకు సంబంధించి రూ.471.38 కోట్లు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 9,775 మందికి రూ.271.04 కోట్లు మాత్రమే మంజూరు చేశారన్నారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు పూర్తిస్థాయిలో రుణాలందించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 19,621 స్వయం సహాయక సంఘాలకు రూ.741.83 కోట్లు రుణాలందించాలని లక్ష్యం ఎంచుకోగా ఇప్పటి వరకు 17,246 సంఘాలకు రూ.1085.99 కోట్లు మంజూరు చేశారన్నారు. పట్టణ ప్రాంతాల్లోని 2,406 స్వయం సహాయక సంఘాలకు రూ.72.77 కోట్లు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించగా 2,136 సంఘాలకు రూ.136.71 కోట్లు మాత్రమే రుణాలు మంజూరు చేశారని తెలిపారు. జిల్లాలో ఉత్పత్తి, సేవ, వ్యాపార రంగాలను ప్రోత్సహించేందుకు ముద్ర రుణాలు అధిక మొత్తంలో మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లా అధికారులు, బ్యాంకర్లు సమావేశం నిర్వహించుకుని సమస్యలపై చర్చించుకుని వాటిని పరిష్కరించుకునేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్‌బిఐ ఎజిఎం ఆర్‌కె.అనుమకుమారి, నాబార్డు డిడిఎం అనిల్‌కాంత్, రీజనల్ హెడ్ యుబిఐ అండ్ డిజిఎం ఎంఎస్.రామారావు, ఎల్‌డిఎం ఎన్‌వివి.రమణ, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

సూక్ష్మ పరిశీలకుల పాత్రే కీలకం

ఎంఎల్‌సి ఎన్నికల శిక్షణలో పరిశీలకులు ఎస్.సురేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని ఎన్నికల పరిశీలకులు, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో సూక్ష్మ పరిశీలకుల విధులపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్లు, సంబంధిత అధికారులతో సురేష్‌కుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమలును నిశితంగా పరిశీలించాలన్నారు. ఉల్లంఘన జరిగితే నివేదిక ఇవ్వాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు తమ నివేదికలను నేరుగా ఎన్నికల సంఘానికి పంపాల్సి ఉందని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. పోలింగ్ బూత్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పని చేయాలన్నారు. రిటర్నింగ్ అధికారితో సమన్వయం చేసుకుని పోలింగ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. ఏదైనా సమస్య, సంఘటన గురించి చెప్పాలనుకుంటే నేరుగా తమకుగాని, జిల్లా ఎన్నికల అధికారికిగాని తెలియజేయాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి డైరీలో ఎన్నికల సంఘటన అంశాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారో, లేదో గమనించాలన్నారు. ఫొటో ఓటర్ల జాబితా నకలు ఒకటి తమ దగ్గర అందుబాటులో ఉంచుకోవాలన్నారు. బ్యాలెట్ బాక్సుకు వేసిన సీళ్లు పరిశీలించాలన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మైక్రో అబ్జర్వర్లు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలన్నారు. పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్ కాస్టింగ్‌కు సంబంధించి రహస్య ఓటింగ్‌కు భంగం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఆయా అంశాలకు సంబంధించి ఏయే ఫార్మేట్లలో నివేదికలు ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఏలూరు జిల్లా డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఏలూరు, భీమవరం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు ఆర్‌డిఒలు కె.పెంచలకిషోర్, డి.రాజు, డాక్టర్ ఝాన్సీరాణి, మల్లిబాబు, జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎన్.బాలకృష్ణన్, ఏలూరు మున్సిపల్ కమిషనరు ఎస్.వెంకటకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డ్వామా పీడీ డి.రాంబాబు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు పోలీసు బందోబస్తు ఏర్పాట్లపై మూడు జిల్లాల ఎస్‌పిలతో ఎన్నికల పరిశీలకులు ఎస్.సురేష్ కుమార్ సమీక్షించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఏలూరు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, పశ్చిమగోదావరి జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్ఇబి అదనపు ఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు పాల్గొన్నారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా నిరోధించేందుకు ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు చెక్ పోస్టులను పటిష్టం చేయాలన్నారు.

ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం సిద్ధం

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని ఎన్నికల పరిశీలకులు ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. జిల్లా అధికారులు ఎన్నికల ఏర్పాట్లను ఆయనకు వివరించారు.

నారీ.. ప్రభాత భేరీ..

- అన్నింటా 'ఆమె'.. ఐనా ఆగని అఘాయిత్యాలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



- ప్రజాశక్తి యంత్రాంగం

నేడు నారీమణులు ప్రభాత భేరి మోగిస్తున్నారు.. అన్ని రంగాల్లో అగ్రపథాన నిలుస్తున్నారు.. అమ్మగా.. ఇల్లాలిగా.. అక్కగా ఇలా ఎన్నో పాత్రలు పోషిస్తూ ఇంటిని చక్కదిద్దుతున్నారు.. ఓర్పులో.. నేర్పులో.. ఓదార్పులో ఆమె సాటి.. ఒకపక్క ఇంటి పనులు చేస్తూ.. మరో పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆర్థికాభివృద్ధి చెందుతున్నారు.. విద్య, వృత్తి, ఉద్యోగాల్లో పురుషులకు ఏమాత్రం తీసిపోమంటూ నిరూపిస్తున్నారు.. అన్నిరంగాల్లో రాణిస్తున్నా మహిళలపై దాడులకు అడ్డుకట్ట పడటం లేదు. ఎన్ని చట్టాలొచ్చినా ఆమె కంట కన్నీటి చెమ్మ ఆరడం లేదు. ప్రభుత్వం చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన ఉందని పలువురు చెబుతున్నారు.. మహిళా దినోత్సవం సందర్భంగా పలువురి మనోగతం..

బహుముఖ ప్రజ్ఞాశాలి మహిళ.. ★ ★ ★



పి.ప్రశాంతి, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్

స్త్రీని గౌరవించినప్పుడే నవ సమాజం రూపందాలుస్తుంది. తల్లిగా, చెల్లిగా, భార్యగా, ఉద్యోగిగా బహుముఖ ప్రజ్ఞాశాలి మహిళ. తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే కుటుంబం కోసం పరితపిస్తుంది. వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సత్కరించుకోవడం మన బాధ్యత. నూతన జిల్లాలో తొలిసారిగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నాం. ఈ ఏడాది మహిళా దినోత్సవం థీమ్ 'ఎంబ్రేస్ ఈక్విటీ' కార్యక్రమం చేపట్టనున్నాం. దీని అర్థం లింగ సమానత్వం. ఈ థీమ్‌పై కార్యక్రమం నిర్వహిస్తాం. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని విజయవంతం చేయాలి.

ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పునకు చిరునామా.. మహిళ



షేక్ నూర్జహాన్ పెదబాబు, నగర మేయర్, ఏలూరు

సృష్టికి ప్రతి సృష్టినిచ్చి సమాజానికి మార్గ నిర్దేశం చేసే ఏకైక వ్యక్తిత్వం మహిళ సొంతం. సంసార సాగరంలో ఓర్పుకు, నేర్పుకు, ఓదార్పునకు మహిళ చిరునామా. అమ్మగా, ఆలిగా, అక్కగా, చెల్లిగా ఆత్మీయతతో అనురాగాన్ని పంచే అమతమూర్తి మహిళ. మారుతున్న మరమనుషుల కాలంలో... మానవత్వం మంటగలుస్తున్న రోజుల్లో.. దినదిన గండాల దాష్టీకాల నడుమ.. ఓపిగ్గా నిలిచే శక్తి మా మహిళలకు ఉంది. ఏలూరు కార్పొరేషన్‌కు రెండుసార్లు మేయర్‌గా పనిచేసే అదృష్టం దక్కడం సంతోషదాయకం. మా స్వస్థలం ఒంగోలు. పదో తరగతి వరకు చదివిన నేను పాలనకు తొలుత భయపడినా.. నగర ప్రజల ఆదరాభిమానాలతో ముందుకు దూసుకుపోతున్నాను. మహిళలు పురుషులతో దేనిలోనూ తీసిపోరు. కష్టపడితే ఏదైనా సాధ్యమే. మహిళలు మరింతగా కష్టపడి సమాజానికి మేలు చేయాలనేది నా ఆకాంక్ష.

మహిళల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి



టి.ధనలక్ష్మి, ఆఫీస్ సూపరింటెండెంట్, సిఎస్ఎన్ కళాశాల, భీమవరం

పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారు. అనేక సందర్భాల్లో మాకు మేమే సాటి అని నిరూపించుకున్న ఘటనలు కోకొల్లలు. అయినా మహిళలకు సమాజంలో సమాన విలువ లేదు. స్వాతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇంకా హత్యలు, అత్యాచారాలు, వివక్ష కొనసాగడం అత్యంత బాధాకరం. మహిళా రక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి



జి.రోసిలిన్, మైక్రో బయాలజీ లెక్చరర్, సిఎస్ఎన్ కళాశాల భీమవరం

పాలకులు మారుతున్నా మహిళలకు పూర్తిస్థాయిలో రక్షణ లేకుండాపోయింది. నేటికీ మహిళలంటే వివక్షకు ప్రతిరూపాలుగా ఉంటున్నారు. చిత్రహింసలకు గురి చేయడంతోపాటు దాడులకు పాల్పడుతున్నారు. ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేసి మహిళలకు రక్షణ కల్పించాలి.

మరిన్ని చట్టాలు రూపొందించాలి..



డాక్టర్ స్వర్ణ నిరంజని, పిహెచ్‌సి వైద్యురాలు, పాలకోడేరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో మహిళా రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయి. దిశ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు, దిశా యాప్, దిశ చట్టం వంటివి అమలు చేస్తుండటం అభినందనీయం. అయితే నేటికీ మహిళలపై దాడులు, అత్యాచారాలు జరగడం ఎంతో బాధిస్తుంది. మహిళా రక్షణకు మరిన్ని చట్టాలు రూపొందించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి



జి.స్వాతి, ఎంపిడిఒ, కాళ్ల

మహిళలకు చదు వే ఆస్తి. ఉద్యోగం తప్పనిసరి. స్వశక్తిగా ఎదగాలి. నా స్వస్థలం విశాఖపట్నం. నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి విద్యాబుద్ధులు నేర్పించారు. కుటుం బంలో మహిళ ప్రభుత్వ ఉద్యోగంలో రాణిస్తే విద్యాబుద్ధులు, క్రమశిక్షణ, పొదుపు, ధైర్యం ఇలా అన్నీ ఆ కుటుంబానికి అలవడుతాయి. 2011లో విశాఖపట్నంలో బిడిఎస్ చేశాక 2012 గ్రూప్-1 పరీక్ష రాసినా ఫలితం రావడం ఆలస్యమైంది. 2017లో గ్రూప్-1కు ఎంపికయ్యాను. 2018లో వీరవాసరం ఎంపిడిఒగా పని చేశాను. ప్రస్తుతం కాళ్ల ఎంపిడిఒగా పని చేస్తున్నాను.

అనుక్షణం మహిళ బాధపడుతూనే ఉంది..



డాక్టర్ డిఆర్.స్వర్ణలత, ప్రిన్సిపల్, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, విస్సాకోడేరు

స్త్రీ లేకపోతే సృష్టే లేదు.. సృష్టే లేకపోతే జననం లేదు. జననం లేకపోతే ఈ ప్రపంచమే లేదు. దేశంలో రోజురోజుకీ మహిళలపై పెరిగిపోతున్న అఘాయిత్యాలు, అత్తారింట్లో ఆగడాలు ఇలా ఎన్నో ఉన్నాయి. చట్టాలెన్ని వచ్చినా మహిళ మాత్రం అనుక్షణం బాధపడుతూనే ఉంది. చట్టాలు, పోలీసు వ్యవస్థ పటిష్టంగా పని చేయాలి. రాజకీయ నాయకుల జోక్యం ఉండరాదు. మహిళా రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.

డాక్టర్ కావాలనే లక్ష్యం నెరవేరింది..



పార్శి సుమ, డాక్టర్, ఏలూరుపాడు, కాళ్ల మండలం

గ్రామీణ ప్రాంతం.. పేద వ్యవసాయ కుటుంబంలో జన్మించాను. మగ, ఆడ వ్యత్యాసాలు లేకుండా పిల్లలను చదివించాలి. నా తండ్రికి ముగ్గురు సంతానం. ముగ్గురిలో నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. డాక్టర్ చేయాలనే నా తండ్రి కల, నా లక్ష్యం నెరవేరింది. నా తల్లిదండ్రుల ప్రేమ, అన్నదమ్ముల ప్రోత్సాహంతో ఈ స్థాయిలో ఉన్నాను. భారతీయ సాంప్రదాయాన్ని గౌరవిస్తూ, తల్లిదండ్రుల మాటకు విలువనిస్తూ ముందుకు సాగడం వల్లే ఈ స్థాయికి వచ్చాను. గురువులు అందించిన గుణాత్మక విద్యను అభ్యసించి డాక్టర్ అయ్యాను. ప్రస్తుతం విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతున్నాను. మహిళలు విద్యలో రాణించాలి. ఆర్థికంగా ఎదగాలి. అప్పుడే సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమవుతుంది.

మహిళా వివక్షకు చరమగీతం పాడాలి..




డాక్టర్ సుధాశ్రీ పూర్ణ, పీజీ హెచ్‌ఒడి, సిఎస్ఎన్ కళాశాల, భీమవరం

సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలు ముందుకు సాగుతున్నారు. పిటి.ఉష, పివి.సింధు, సానియా మీర్జాతోపాటు వివిధ రంగాల్లో అన్ని విధాలా దూసుకెళ్తున్నారు. అయితే సమాజంలో మాత్రం మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగడం బాధాకరం. ఈ అంశాన్ని అందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. మహిళా వివక్షకు చరమగీతం పాడే విధంగా చర్యలు తీసుకోవాలి.

పేదింట పుట్టి.. బాక్సింగ్‌లో రాణించి.. ★ ★ ★

ప్రజాశక్తి - పెనుమంట్ర



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న శైలజ

నిరుపేద కుటుంబంలో పుట్టి బాక్సింగ్‌లో రాణిస్తోంది నత్తరామేశ్వరం పంపనవారిపాలెం చెందిన కోడె తేజస్విని వెంకట శైలజ. మహిళా దినోత్సవం సందర్భంగా బాక్సింగ్ కోచ్ చిరంజీవి విలేకరులతో మాట్లాడారు. కోడె తేజస్విని వెంకట శైలజ పీజీ ఫస్ట్ ఇయర్ చదువుతూ బాక్సింగ్లో రాణిస్తోందన్నారు. ఇప్పటికే శైలజ జాతీయ స్థాయిలో 6 సార్లు, అంతర్జాతీయ స్థాయిలో 2 సార్లు ప్రతిభ కనబర్చినప్పటికీ ఆల్ ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో ఒకసారి సత్తా చాటి బెస్ట్ బాక్సర్‌గా 5 ఐదు సార్లు అవార్డు అందుకుందని తెలిపారు. ఈ నెల 20 నుంచి 23వ యువ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జాన్ పూర్తిలో జరిగే ఇంటర్నేషనల్ యూనివర్సిటీ పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు. శైలజ గణతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా యంగ్ అచీవర్స్ అండ్ మోస్ట్ టాలెంట్ పర్సన్ ఇన్ స్పోర్ట్స్ అవార్డు అందుకుందన్నారు. అలాగే పెనుమంట్రకు చెందిన కె.శరణ్య పెనుమంట్ర హైస్కూల్ ఏడో తరగతి చదువుతూ జిల్లా స్థాయిలో నాలుగు సార్లు గోల్డ్ మెడల్, రాష్ట్ర స్థాయిలో 1 గోల్డ్ మెడల్, 1 సిల్వర్, 1 బ్రౌజ్ మ్డెడల్ సాధించినట్లు తెలిపారు. నత్తా రామేశ్వరం శివారు పంపన వారి పాలెం చెందిన పంపన కుసుమ కావ్య డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతూ రాష్ట్రస్థాయిలో 5, జాతీయ స్థాయిలో 2 సార్లు గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు.

పదో తరగతి భవిష్యత్తుకు పునాది

ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్

ప్రజాశక్తి - భీమవరం

భవిష్యత్తులో ఏ లక్ష్యాన్ని చేరుకోవాలన్నా దానికి పునాది పదో తరగతి అని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ అన్నారు. స్థానిక అల్లూరి రామకృష్ణం రాజు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అంశంపై మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ వృత్తిని ఎంచుకోవాలన్నా దానికి అనుగుణంగా ఇప్పటి నుంచే అడుగులు వేయాలన్నారు. పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్, ఐటిఐ, పాలిటెక్నిక్, ఒకేషనల్ తదితర కోర్సులు వాటిలో ఉన్న గ్రూపుల వివరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వి.భానుప్రకాశ్, పట్టణ కమిటీ సభ్యులు బి.గణేష్, బి.దేవేంద్ర, పి.సుజిత పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి తద్వారా సమాజానికి మంచి పేరు తేవాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. ఈ సందర్భంగా కంటి వెలుగులో భాగంగా కొడమంచిలి హైస్కూల్ విద్యార్థులు సుమారు 30 మందికి హైదరాబాద్‌కు చెందిన రాధ స్వామి స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు చేసిన కళ్లజోళ్లను సుంకర సీతారామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందించే విధంగా ముఖ్యమంత్రి అనేక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ బోరుసు రాంబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొమ్మేటి రాంబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబానికి తాతాజీ చేయూత

ప్రజాశక్తి - పాలకొల్లు

గత 30 ఏళ్లుగా షాపులో పనిచేస్తున్న హుస్సేన్ తన యజమాని షాప్ తీసేయడంతో రోడ్డున పడ్డాడు. అయితే ఆ కుటుంబానికి చేయూతగా నిలుస్తూ డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ తోపుడు బండిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా హుస్సేన్, షాదియా దంపతులు మాట్లాడారు. బండి లేక రోడ్డు మీదే సరుకులు పెట్టుకుని టిఫిన్, టీ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నామని, పట్నంలో చాలా మంది చిరు వ్యాపారులకు తాతాజీ బండ్లు ఇచ్చి వారిని ఆదుకుంటున్నారని తెలిసి ఆయనను కలిశామని, అడగగానే బండి ఇచ్చినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి శ్రీను, జోగాడ ఉమామహేశ్వరరావు, కొరగింజల శ్రీను, చెన్ను విజయ్, గంటా నరేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

చందపర్రు మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాలకొల్లు వీర మల్లి స్పెషాలిటీ డెంటల్ క్లినిక్, విశ్వమానవవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత దంత పరీక్షలు డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వర మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు దంతాలు ఎలా శుభ్రం చేసుకోవాలనే విషయంపై అవగాహన కల్పించారు. దంతవ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం టూత్ పేస్టులు, అవసరమైన మందులు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో విశ్వమానవవేదిక అధ్యక్షులు మల్లుల సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శీలం అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి - పోడూరు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమ్ముచిక్కాలలో టైలరింగ్‌పై మహిళలకు శిక్షణ కార్యక్రమం ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు, వృద్ధులకు వసుధ ఫౌండేషన్ అందిస్తున్న ఎన్నో సేవలందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కన్వీనర్ పి.ఇంద్రరాజు, పోడూరు మాజీ సర్పంచి రుద్రరాజు సుజాత, గుంటూరు చంటిరాజు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేధస్సు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పుస్తక పఠనంతో మేధస్సు వృద్ధి చెందుతుందని దాత జి.సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయానికి పది వేల రూపాయల విలువైన కాంపిటేటివ్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, విద్యార్థులు, గ్రంథాలయంలోని పుస్తకాలను వినియోగించుకోవాలని కోరారు. రిటైర్డ్ ఎఇఇ సల్యాన్‌రాజు సమన్వయంతో గ్రంథాలయంలోని తలుపులకు దోమలు రాకుండా దోర్ మెష్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారి వానపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.భాస్కరరావు, ఎవి.లక్ష్మణరావు, అమ్మన రాజు పాల్గొన్నారు.

రూ.కోటీ 70 లక్షలతో అభివృద్ధి : సర్పంచి

ప్రజాశక్తి - ఉండి

సర్పంచిగా ఎన్నికైన రెండున్నర సంవత్సరాల్లో ఉండి గ్రామ పంచాయతీ పరిధిలో కోటి 70 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, గ్రావెల్ రోడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ తెలిపారు. ఉండి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. ఉండి గ్రామాభివృద్ధికి డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తుల సహకారం అందిస్తున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉండి గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు పుష్కలంగా అందించేందుకు ఫిల్టర్‌బెడ్లను శుభ్రపరిచి స్వచ్ఛమైన నీరు అందించేందుకు కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజారాజేశ్వరి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి మహిళల హక్కులు, మహిళలకు జరిగే అన్యాయాలపై ఫిర్యాదు ఏవిధంగా చేయాలి, ఎటువంటి చట్టాలు ఉన్నాయి తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలకొల్లు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జివి.సుబ్బారావు మాట్లాడారు. అనంతరం మహిళా ఉద్యోగులను సత్కరించారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు రామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబర్చారు. 9వ తరగతి విద్యార్థిని నాగరాజు కీర్తిశ్రీ రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి, 8వ విద్యార్థి మండెల మోహిత్ వర్మ ద్వితీయ స్థానం సాధించారు. తమ విద్యార్థులు క్రమం తప్పకుండా ఏటా ఒలింపియాడ్‌లో విజేతలుగా నిలుస్తున్నారని స్కూల్ డైరెక్టర్ కెవి.కృష్ణవర్మ అన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను వారికి శిక్షణ అందించిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.


టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరికి మాతృవియోగం

ప్రజాశక్తి - ఉండి

టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు తల్లి సీతా కమలావతి మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతితో వెలివర్రులో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె కుమారుడు వెంకటేశ్వరరాజు ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులుగా కర్నూలు జిల్లా పాణ్యం నియోజకవర్గంలో ఉన్న సంగతి తెలిసిందే. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

సాంబమూర్తి నేటి తరానికి ఆదర్శనీయులు

ప్రజాశక్తి - మొగల్తూరు



ఆదూరి సాంబమూర్తి అనసూయ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న మాజీ మంత్రి సుబ్బారాయుడు ,సిపిఎం నాయకులు

సిపిఎం నేత ఆదూరి సాంబమూర్తి కమ్యూనిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితుడై యుక్త వయసులోనే సిపిఎంలో చేరి ఉద్యమ బాటలో సుదీర్ఘకాలం నడిచారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం అన్నారు. మంగళవారం మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెంలో ఆదూరి సాంబమూర్తి అనసూయ దంపతుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. సాంబమూర్తి నిస్వార్థంగా ప్రజా, రైతు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమాలు నిర్వహించారన్నారు. మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ సాంబమూర్తి సేవలు నేటి తరానికి ఆదర్శమన్నారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల విజయవంతానికి సాంబమూర్తి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ సాంబమూర్తి చేపట్టిన ప్రజా ఉద్యమాలకు ఆయన సతీమణి అనసూయ కూడా సహకారం అందించడం అభినందనీయమని కొనియాడారు. పదవులు ఆశించకుండా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. మొగల్తూరులోని కిల్లి సోడా వర్తక సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తోట హరిచంద్ర ప్రసాద్ అన్నారు. సొసైటీలో ఉపాధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో రైతు సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారని సొసైటీ ఛైర్‌పర్సన్ మోటిపల్లి రామ భాస్కరరావు అన్నారు. ఆదూరి సాంబమూర్తి మాట్లాడుతూ తాను కమ్యూనిస్టు పార్టీ వైపు వచ్చేందుకు పుచ్చలపల్లి సుందరయ్య ఆదర్శమన్నారు. పార్టీ మొగల్తూరు శాఖకు రూ.ఐదు లక్షలు, జిల్లా శాఖకు రూ.2 లక్షలు, నర్సాపురం పార్టీ కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు లక్ష రూపాయలు, ఐద్వాకు రూ.50,000 ఇచ్చానని తెలిపారు. తన ఆస్తి అంతా సిపిఎం పార్టీ అని అన్నారు. తుది శ్వాస విడిచే వరకూ పార్టీ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. తన మరణానంతరం తన దేహాన్ని మెడికల్ కళాశాలకు ఇచ్చేందుకు ప్రక్రియ అంతా పూర్తి చేశానని తెలిపారు. అనంతరం సాంబమూర్తి దంపతులను ఘనంగా సత్కరించారు. తరువాత సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చింతకాయల బాబూరావు, జెఎన్‌వి గోపాలన్, కేతా గోపాలన్, ఎ.రవి, తెలగంశెట్టి సత్యనారాయణ, వలవల శ్రీరామ్మూర్తి, పొదిలి కృష్ణమూర్తి, జుత్తిగ నరసింహమూర్తి, పివి.ప్రతాప్, పొన్నాడ రాము, యడ్ల చిట్టిబాబు, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, బోణం నరసింహారావు, జి.శ్రీను పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనకు ఉద్యమించాలి : ఐద్వా

ప్రజాశక్తి - మొగల్తూరు



మొగల్తూరు : మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ

మహిళలు హక్కుల సాధనకు ఉద్యమం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. మొగల్తూరులోని శ్రీవాసవీ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు మేడిద స్వర్ణలత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళల హక్కుల కోసం ప్రభుత్వం మహిళా దినోత్సవం జరపాలన్నారు. మహిళలకు రక్షణ కరువైందని, స్కీం వర్కర్లు కనీస వేతనాలకు కూడా నోచుకోకుండా వారితో వేటి చాకిరీ చేయిస్తున్నారన్నారు. శ్రామిక మహిళా నాయకురాలు ఎ.అజయ్ కుమారి మాట్లాడుతూ అందాల పోటీల పేరుతో ఆడవాళ్లను తక్కువ చేసి చూస్తున్నారని హక్కుల కోసం మనమందరం పోరాటం చేయాలని తెలిపారు. మహిళల రక్షణ కోసం పోరాటం చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం హెచ్‌ఎం రాయపూడి భవాని ప్రసాద్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి నిట్టల శైలజ మాట్లాడుతూ పురుషులతో సమానంగా స్త్రీలు కూడా పోటీ ప్రపంచంలో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అనంతరం మహిళా ఉపాధ్యాయిలను, సచివాలయ సిబ్బందిని సత్కరించారు. లయన్స్ రూరల్ ప్రెసిడెంట్ గూడూరి హనుమంతరావు, మహిళా ఉపాధ్యాయులు బొక్క భవాని దుర్గ, చంద్రకళ, అడ్మిన్ రాజేశ్వరి, కొత్తల వెంకట కుమారి పాల్గొన్నారు.

మహిళలు స్వతంత్రంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ అసిస్టెంట్ కార్యదర్శి గోటేటి లక్ష్మి అలివేలు కోరారు. మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థిగా, ప్రస్తుతం ముఖ్యఅతిథిగా పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. ప్రస్తుతం ఇంటర్నెట్ లభ్యమయ్యాక గ్రామీణ ప్రాంతాల్లో సైతం మహిళలు ఆర్థికంగా, వైజ్ఞానికంగా, శాస్త్ర, సాంకేతికంగా, రాజకీయంగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు కలిగాయని వాటిని వినియోగించుకొని అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని కోరారు. అనంతరం కళాశాల అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం ప్రకటించారు. అలివేలు దంపతులను కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. సభకు ప్రిన్సిపల్ శోభారాణి అధ్యక్షత వహించారు.కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీఖాకొల్లు మైథిలి, పోలిశెట్టి లత, అడబాల వాణిశ్రీ, కె.రాజా శ్యామల, కొమ్ముల శ్రీలక్ష్మి, కెవైఎస్.వర్మ పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

తాడేపల్లిగూడెం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని భావితరాలకు మన సంస్కృతీ, సంప్రదాయాలను అందించే బాధ్యతలు మహిళల దేనని ఎఎంసి ఛైర్మన్ గుండుబాగుల వెంకటరమణ అన్నారు. మంగళవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్లో డైమండ్స్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్ కోనా కళ్యాణి, డివైఇఒ రవీంద్ర భారతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. క్లబ్ అడ్మిన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోనా హనుమాన్, లయన్స్ క్లబ్ జిల్లా ఉపగవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, లయన్ దుగ్గిరాల రమాకుమారి మాట్లాడారు. అనంతరం డివైఇఒ భారతి, ఎఎంసి ఛైర్మన్ గుండుబోగుల వెంకటరమణ, అంజనా దేవి.సునీత.పి.సాయిలక్ష్మి, రత్నకుమారిని క్లబ్ తరుపున సత్కరించారు.

పాలకొల్లు రూరల్ : లయన్స్ ఫెమినా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ వసంత లక్ష్మి మాట్లాడారు. ఆడపిల్లల జీవితంలో అత్యంత ప్రభావితం అయ్యే వయస్సు కాలేజీ రోజులని, 18 నుంచి 20 వరకూ శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండి జీవితంలో లక్ష్యసాధనం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ వసంత లక్ష్మి, సెక్రటరీ మీనా మణి దీప్తి, మౌని, యామిని పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి దూలం కిషోర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఎం.కాజాబాబు, పిడికె.శ్రీనివాసరెడ్డి, నెహ్రూ యువ కేంద్ర వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళలు ఒకవైపు ఉద్యోగం చేస్తూ, మరోవైపు కుటుంబాన్ని నడిపిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థ ఇన్‌ఛార్జి ఎడిఆర్ టి.శ్రీనివాస్ అన్నారు. సంస్థలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం విద్యార్థులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని పోటీ పరీక్షల్లో ఎక్కువగా మహిళలే ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. మహిళా శాస్త్రవేత్త డాక్టర్ వై.సునీత మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించుకుని తమను తాము రక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కెఎం.దక్షిణామూర్తి, డాక్టర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆకివీడు : ఆడపిల్ల పుట్టినరోజు సంతోషపడిన నాడే మహిళా దినోత్సవానికి నిజమైన సార్థకత అని ప్రముఖ డాక్టర్ కనుమూరి మాధవి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ కనుమూరు మాధవి, ఇంజినీరింగ్ అధికారి రమణమ్మ హాజరై మాట్లాడారు. అనంతరం వారు ఇరువురిని కళాశాల సిబ్బంది సత్కరించారు.

గ్లోబల్ సమ్మిట్ ద్వారా అభివృద్ధి : పివిఎల్

ప్రజాశక్తి - కాళ్ల




మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ నరసింహరాజు

గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్ ద్వారా రాష్ట్రాన్ని పారిశ్రామికంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గ్లోబల్ ఇన్వెస్టిమెంట్ సమ్మిట్ విజయవంతంపై హర్షం వ్యక్తం చేస్తూ పెదఅమిరంలోని వైసిపి కార్యాలయం వద్ద మంగళవారం సంబరాలు నిర్వహించారు. తొలుత మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజు మృతికి సంతాపం తెలిపి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉండి నియోజకవర్గానికి సర్రాజు చేసిన సేవలు మరువలేమని పివిఎల్ తెలిపారు. పెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపీట వేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన పెట్టుబడులు చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ప్రపంచ దేశాలు గర్వించదగ్గ పారిశ్రామికవేత్తలు అదాని, ముఖేష్ అంబానీ తదితర పారిశ్రామికవేత్తలు వచ్చినా ప్రతిపక్షాలకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే ఉందన్నారు. కార్యక్రమంలో కాళ్ల, ఉండి, ఆకివీడు జెడ్‌పిటిసిలు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థుల మహంకాళి, ఎంపిపిలు పాల్గొన్నారు.

సిపిఎం నేత కట్టయ్య మృతి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కలగంపూడి గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు మల్లుల కట్టయ్య (97) మంగళవారం ఆయన స్వగృహం వద్ద మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు కట్టయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977-1982 మధ్యకాలంలో చించినాడ, కలగంపూడి గ్రామాలలో భూస్వాములుకు పేదలకు మధ్యజరిగిన మహా పోరాటంలో పేదల పక్షాన నిలబడి కట్టయ్య ఎన్నో కేసులు ఎదుర్కొని జైలు జీవితం గడిపారని తెలిపారు. తుదిశ్వాస విడిచేవరకూ ఎర్రజెండాను విడనాడకుండా ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని కొనియాడారు, నివాళులర్పించిన వారిలో మాసవరపు సుబ్బారావు, గూడూరి ఆంజనేయులు, కుమార్, సత్యనారాయణ, చక్రపాణి ఉన్నారు



కట్టయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

వినియోగంలోకి రాయకుదురు తాగునీటి చెరువు

ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ ధనానందన్

ప్రజాశక్తి - వీరవాసరం



తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ధనానందన్

వదేళ్లుగా రాయకుదురు తాగునీటి చెరువు నిరుపయోగంగా మారడంతో దాన్ని వినియోగంలోకి తేనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ కె.ధనానందన్ తెలిపారు. మంగళవారం ఆయన రాయకుదురులో తాగునీటి చెరువును పరిశీలించారు. తాగునీటి చెరువు అభివృద్ధి పేరుతో కొన్నేళ్లుగా పంచాయతీ పాలకవర్గాలు నిధులు వెచ్చిస్తున్నారు తప్ప చెరువులో నీటిని నింపి వినియోగంలోకి తీసుకురావడం లేదంటూ హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జిల్లా వైస్ ఛైర్మన్ పిన్నపరెడ్డి పెద్దిరాజు ఈ నెల 6న స్పందన ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందించి చెరువు ద్వారా తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించడంతో డిఇ చెరువును పరిశీలించారు. చెరువులో నీటిని నింపేందుకు ఉన్న అవకాశాలను స్థానిక అధికారులతో, సర్పంచి గెడ్డం భారతీభాస్కరరావుతో పరిశీలించారు. ప్రస్తుతానికి చెరువు ఇన్‌లెట్‌గా ఉన్న బోదె వ్యర్థాలతో, కలుషిత జలాతో నిండి ఉండటం వల్ల చెరువునీటిని సరఫరా చేయడంలేదని సర్పంచి తెలిపారు. దీనికి ప్రత్యామ్నాయంగా రాయకుదురు తూర్పు కాలువ ఎగువ భాగంలో సుమారు నాలుగు వందల మీటర్ల పైపులైన్ వేసి చెరువులో నీటిని నింపేందుకు ఆస్కారం ఉందని గుర్తించారు. ఇందుకు అవసరమైన నిధులను జలజీవన్ మిషన్ నుండి వెచ్చించే విధంగా అంచనాలు రూపొందించి చెరువులో నీటిని నింపే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఆయన వెంట ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ కనకారావు, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్, ఎఎంసి వైస్ ఛైర్మన్ చిలకపాటి సునీత ఉన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE :: ELURU
I.A.No. 412/2022
O.S.No. 71/2015

Between:
Y. Veeramma ***...Petitioner /Plaintiff***
VS
Gayam Bajaramma (Died) & others
...Respondents /Defendants

NOTICE

9th RESPONDENT:
9) Sole Lakshmi, W/o. Sreenu, Linga palem Village, Chintalapudi Mandal.

Whereas the plaintiff filed suit for partition of the plaint schedule property against the defendants. In the said suit the 1st defendant died and that the plaintiff filed the above petition to impled the 9th respondent as Legal heir of 1st defendant. The Honurable court order fresh summons to the 9th respondent.

Whereas in the above petition the notice addressed to the 9th respondent in the above petition could not be served as last known address and the notice could not be served.

Whereas the Honorable court ordered notice to the 9th respondent by substituted service by way of publication.

You, are hereby called upon to appear in person before this **Honourable court Eluru on 15-03-2013 at 10:30 A.M.** and state your objections if any. Lest the petition will be decided exparte.

(As per orders)
Eluru, **DEVULAPALLI KRISHNA SASTRY**
06-03-23. Eluru, Advocate

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
S.O.P No: 28/2023

Between:
1. శ్రీమతి కూర్మాల పద్మావతి, W/o. లేటు కూర్మాల తారక ఆంజనేయ నరసింహ గుప్తా, హిందు, వయస్సు 58సం॥లు, హౌస్‌వైఫ్, నివాసము ఫ్లాట్ నెం. 202, 3వ అంతస్తు, వైభవ్ ఫోర్ట్-3, డాక్టర్ జాన్ స్ట్రీట్, నరసింహారావు పేట, ఏలూరు, వెస్ట్ గోదావరి జిల్లా-534 006.
2. శ్రీమతి కొత్తమాసు హేమ నాగలక్ష్మి ప్రపూర్ణ, W/o. కొత్తమాసు వాళేశ్వరరావు, హిందు, వయస్సు 38సం॥లు, హౌస్ వైఫ్, నివాసము, డోర్ నెం. 4-5-21/యస్-4, చదువుల వీధి, వుడ్‌పేట, అనకాపల్లి, విశాఖపట్నం, ప్రస్తుత నివాసము నరసింహారావుపేట, ఏలూరు.
3. శ్రీమతి కూర్మాల నాగ వెంకట నీరజ, W/o. వి.బదరీనాథ్, హిందు, వయస్సు 35 సం॥లు, హౌస్ వైఫ్, నివాసము, డోర్ నెం. 103, పద్మావతి పెండెంట్స్, 5వ క్రాసు, యం.యస్. లే-అవుట్, జె.పి. నగర, 6వ ఫేజ్, బెంగుళూరు (సౌత్), కర్ణాటక-560078, ప్రస్తుత నివాసము నరసింహారావు పేట, ఏలూరు
...పిటీషనర్లు

And:
Nil ... రెస్పాండెంట్

PUBLIC NOTICE

పైన పేర్కొన్న వాదులు పై పిటీషను సక్సెషన్ సర్టిఫికెట్ మంజూరు కొరకు మరియు మొదటి పిటీషనరు గారి పేరు మీదకు ఈక్రింది పేర్కొన్న షెడ్యూల్ దాఖలా షేర్లు, లేటు కూర్మాల తారక ఆంజనేయ నరసింహ గుప్తావి, ట్రాన్స్ఫర్ చేసుకొందులకు వేసియున్నారు. కావున సదరు షేర్లకు సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరాలు, క్లయిములు, హక్కులు, ఎటువంటి ఆసక్తులు గాని ఉన్నయెడల సదరు దావాకు ప్రత్యుత్తరము చెప్పగా అందువలన **2023 సం, మార్చి నెల 20వ తేది పగలు గం॥ 10.30ని॥లకు** స్వతహాగాగాని లేక సరైన భోగట్టా ఇవ్వబడిన వకీలు ద్వారాగానీ లేక సరైన ఏజెంట్ మూలంగా ఈకోర్టులో హాజరయ్యేటట్లు ఇందువలన పైకోర్టు వారు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా ఆజ్ఞాపించడమైనది. పైనచెప్పబడిన దినమందు ఎవరైనను హాజరుకాకుండా తప్పినయెడల పైపిటీషన్‌కు సంబంధించి ప్రతివాదులు లేరు అని తీర్మానించుటమగునని మీరు తెలుసుకోవలసినది.

SCHEDULE

S.No	ISIN CODE	SCRIPT NAME	VALUE (Rs.)
1	INE028A01039	Bank of Baroda Eq New Fv Rs.2/-	9,336
2	INE170B01037	Cat Technologies limited -eq new fv Rs.10/-	760
3	INE522F01014	Coal India Ltd-Eq	22,615
4	INE007B01023	Geojit Financial Services Ltd Eq New Fv Rs.1/-	23,100
5	INE009A01021	Infosys Ltd Eq Fv Rs.5/-	3,70,320
6	INE237A01028	Kotak Mahindra Bank Ltd-Eq New Fv Rs.5/-	2,211,747
7	INE414G07EJ2	Muthoot Finance Ltd OSrXXII option III 9.75 Ncd 27DC24 Fv Rs.1000/-	3,04,680
8	INE752E01010	Power Grid Corporation of India Ltd.-Eq	40,808
9	INE700C01013	Prithvi Information Solution Ltd. Eq	1,000
10	INE435C01024	Texmaco Infrastructure & Holdings Ltd. Eq New Rs.1/-	29,075
11	INE621L01012	Texmaco Rail & Engineering Ltd. Eq	28,075
12	INE996A01029	Valuemart Info Technologies Ltd.-Eq New Fv	100
13	INE703A01011	Videocon Industries Ltd.-EQ	290
14	IN30061010059713	Muthoot Securities Ltd.	3,00,000
		Total value of Holdings	**33,41,907**

(By Order of the Hon'ble Court) **B. SRINIVASA RAO**, Advocate
40-56-44, Sanjevayya Colony, Thatichetlapalem, Visakhapatnam. **Cell: 94944 00239**

సిఎంకు ఇష్టమైనది వైఎస్ఆర్ సేవాదళ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఇష్టమైన పదవి వైఎస్ఆర్ సేవాదళ్ అని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జిల్లా సేవాదళ్ అధ్యక్షులుగా నియమితులైన భలే ఏసుబాబు, లూర్థమ్మ స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పట్టణంలోని దళిత సోదరులందరూ కలిసి ఎంఎల్ఎను సత్కరించారు. దళితుల పట్ల ఎంతో ప్రేమ చూపుతున్న ముఖ్యమంత్రికి, ఎంఎల్ఎకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎంఎల్ఎ గ్రంధి మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఇష్టమైన పదవుల్లో ఈ సేవాదళ్ ఒకటి అని అన్నారు. అందరు పార్టీ కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో భలే లూర్థమ్మ (ఎక్స్ ఎఎంసి డైరెక్టర్), జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, కందికట్ల అడ్వార్డ్, పాలపర్తి జోనా ప్రియదర్శిని పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

ఏలూరు జిల్లా, ఏలూరు, శనివారపుపేట కాపురస్తులయిన **శ్రీ మల్లెమొగ్గల రమేష్‌బాబు గారు** ది. 15-11-2022న ఏలూరు కొత్త బస్ స్టాండ్ నందు బస్సు ఎక్కుచుండగా వారి యొక్క firm M/s. GIDEON FARM SERVICE కు సంబంధించిన S.B.I. బ్యాంకు, శ్రీరామ్ నగర్ బ్రాంచ్ చెక్కు నెంబరు: **757311, A/c. No. 30947249695** పోగొట్టుకొనినారు. మళ్ళీ ఎంత వెతికినా దొరకలేదు. కావున ఈ చెక్కు దొరికినవారు ఈక్రింది ఫోన్ నెంబరుకు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

గొర్రెల సతీష్ కుమార్ (GSKN)
న్యాయవాది, గాంధీనగర్, ఏలూరు
ఏలూరు జిల్లా, సెల్: 9848611998

నోటీసు

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.పి.నెం. 2/2021

బిట్వీన్:
1) ముత్యాల మధు బాబు ***...పిటీషనరు/పిటీషనరు***
VS
1) శ్రీ కాండ్రు శ్రీరామారావు, తండ్రి: అప్పారావు, డో.నెం. 11-105, షాజహాన్ టిప్టాప్ స్ట్రీట్, జంగారెడ్డిగూడెం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా.
...రెస్పాండెంటు /2వ రెస్పాండెంటు

పై నెంబరు ఇన్సోల్వెన్సీ పిటీషను కేసులో రెస్పాండెంటు /2వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు నోటీసులు రిజిష్టరు పోస్టులోనూ మరియు శ్రీకోర్టు వారి ద్వారాను పంపించుచున్నప్పటికిని వాటిని మీరు తీసుకోకుండా ఉదేశ్యపూర్వకంగా నిలువరించుచున్నారు. కావున శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం **ది.10-04-2023వ తేదీన ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, లాయరు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియచేసుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 10-04-2023
కొవ్వూరు, **కె.వి.వి.హరిమోహన్**
06-03-23. అడ్వకేట్, కొవ్వూరు

మహారాజశ్రీ ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం.41/2017, ఒ.ఎస్.నెం.59/2016

బిట్వీన్:
దాసరి చిన్నమనాయుడు & others ***...డిక్రీ హోల్డర్***
మరియు
శ్రీ పోసా శ్రీనివాస్ ***...జడ్జిమెంట్ డెటార్***

పై నెంబరు వారంటు గ్రంధములో డిక్రీ హోల్డరు తన బాకీ వసూలు నిమిత్తం దాఖలు చేసిన ఇ.పి. గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం ఈ దిగువ తెలియపరిచిన ఇ.పి. షెడ్యూలు దాఖలా ఆస్థిని పై కోర్టులో **ది.23-03-2023వ తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు బహిరంగముగా వేలము వేయుదురు.** కావలసిన వారు సదరు వేలములో పాల్గొని నియమ నిబంధనల ప్రకారం షెడ్యూలు దాఖలా ఆస్థిని పాడుకొనవచ్చును.

షెడ్యూలు ఆస్థి: ***ఎ-షెడ్యూలు:*** పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు మండలం, ఏలూరు సబ్ రిజిష్ట్రీ యిలాకా, ఏలూరు పట్టణం, గాంధీ నగరం, శేఖర్ వీధి, బ్లాక్ నెం.10, మున్సిపల్ ఇ-వార్డు టి.యస్.నెం.320 మరియు 954ర్లు దాఖలా చ॥గ॥224-6-0లో దక్షిణం వైపు చ॥గ॥44-0లు స్థలములో పడమర వైపున గల చ॥గ॥22-0-0లు స్థలము, అందులో గల డో.నెం. 20బి-10-17రు గల రేకుల షాపునకు హద్దులు:
తూర్పు: పోసా జయవెంకటరెడ్డి గారి ఆస్థి అ॥10-0లు.
దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥19-5లు.
పడమర: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు అ॥10-0లు.
ఉత్తరం: జడ్జిమెంటు డెటార్ గారి తాలూకు ఆస్థి, పోసా జయ వెంకటరెడ్డి గారి ఆస్థి అ॥19-5లు.
డిక్రీ హోల్డర్ కిమ్మత్తు : రూ.15,00,000/-
అమీనా కిమ్మత్తు : రూ.18,00,000/-

టి.సుబ్బరాయ శర్మ
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
07-03-23. సెల్: 94401 83248